


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
25 -04-2025
పేజీలు: 02

## ఐపీఎల్‌లో నేడు



చెన్నై VS హైదరాబాద్
చెన్నై,
రాత్రి:7.30



స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్ స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్ | 8 | 6 | 2 | 12 |
| ఢిల్లీ | 8 | 6 | 2 | 12 |
| ఆర్సీబీ | 9 | 6 | 3 | 12 |
| పంజాబ్ | 8 | 5 | 3 | 10 |
| లక్నో | 9 | 5 | 4 | 10 |
| ముంబై | 9 | 5 | 4 | 10 |
| కోల్‌కత్తా | 8 | 3 | 5 | 6 |
| రాజస్థాన్ | 9 | 2 | 7 | 4 |
| సన్‌రైజర్స్ | 8 | 2 | 6 | 4 |
| చెన్నై | 8 | 2 | 6 | 4 |



ఆరెంజ్ క్యాప్
417
ఐపీఎల్
అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
16
ఐపీఎల్
అత్యధిక వికెట్స్



# సారంగపాణి జాతకం రివ్యూ

ప్రస్తుతం ప్రియదర్శి వరుసగా సక్సెస్‌లు కొడుతున్నాడు. బలగం, 35, కోర్ట్ అంటూ హిట్ల మీద హిట్లు కొడుతున్నాడు. ఇక ఇప్పుడు సారంగపాణి జాతకం అంటూ ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఏప్రిల్ 25న ఈ చిత్రం విడుదలైంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లు ఆద్యంతం అందరినీ నవ్వించాయి. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్‌గా వచ్చిన ఈ సారంగపాణి జాతకంతో అటు ప్రియదర్శి, ఇటు ఇంద్రగంటి మోహనకృష్ణ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. అసలు ఈ మూవీ ఎలా ఉందో, కథ ఏంటో ఓ సారి చూద్దాం.

సారంగపాణి (ప్రియదర్శి) జాతకాల్ని ఎక్కువగా నమ్ముతాడు. చేతిలో ఉన్నవి గీతలు కాదు మన తలరాతలు అనే టైపులో బతుకుతుంటాడు. సారంగపాణి ఓ కారు కంపెనీలో సేల్స్ మెన్‌గా పని చేస్తుంటాడు. అదే కంపెనీలో మైథిలీ (రూపా కొడవయూర్) మేనేజర్‌గా పని చేస్తుంటుంది. ఇక ఈ ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఇద్దరూ పెళ్లికి సిద్ధపడటంతో ఎంగేజ్మెంట్ కూడా జరుగుతుంది. ఆ టైంలోనే సారంగపాణి జాతకం చూసిన జిగ్గేశ్వర్ (శ్రీనివాస్ అవసరాల) ఓ షాకింగ్ విషయం చెబుతాడు. నీ జాతకంలో ఒక హత్య చేస్తావు అని ఉందని చెప్పడంతో సారంగపాణికి ఏం చేయాలో పాలుపోదు. ఒక వేళ పెళ్లి తరువాత ఆ హత్య చేస్తే మైథిలీ జీవితం ఏం అయిపోద్దో అని సారంగపాణి కంగారు పడతాడు. పెళ్లికి ముందే తన జాతకంలో ఉన్న ఆ హత్యను చేసేయాలని తన ఫ్రెండ్ చందు (వెన్నెల కిషోర్)తో సారంగ రకరకాల ప్రయత్నాలు చేస్తాడు. ఈ క్రమంలో సారంగకు ఎదురైన పరిస్థితులు ఏంటి? చందు, సారంగ కలిసి చేసిన పనులు ఏంటి? చివరకు అహోబిల రావు (తణికెళ్ల భరణి)ని చంపాలని సారంగ ఎందుకు ఫిక్స్ అవుతాడు? చిరవకు సారంగ ఏం చేశాడు? అతని జాతకంలో చెప్పినట్టుగానే అంతా జరిగింది? చివరకు తన ప్రేమను సాధించుకున్నాడా? అన్నదే కథ.

సారంగపాణి జాతకంలో కొన్ని లోపాలున్నా కూడా ఈ సారి ఇంద్రగంటి, ప్రియదర్శి పంట పండినట్టే అనిపిస్తుంది. టేకాఫ్ కాస్త స్లోగా, బోరింగ్‌గా అనిపించినా కూడా ఆ తరువాత కథలోకి లీనం అవుతారంతా. స్టార్టింగ్ ఓ ఇరవై నిమిషాలు అంతగా ఎక్కకపోయినా.. మర్డర్ ఆలోచనలు రావడం, హత్య చేయడం గురించి వెన్నెల కిషోర్, ప్రియదర్శి మాట్లాడుకునే మాటలు.. ఎవరిని టార్గెట్ చేద్దామని ఆ ఇద్దరూ చేసే ప్రయత్నాలు నవ్విస్తాయి. అలా ఫస్ట్ హాఫ్ అంతా కూడా సరదాగా సాగుతుంది. ఏం చేసినా తిరిగి బెడిసి కొట్టడంతో చివరకు తన బాస్‌ను పైకి పంపించాలని అనుకుంటారు. ఆ ఇంటర్వెల్ ఎపిసోడ్ కూడా చాలా ఫన్నీగానే ఉంటుంది. అలా ఫస్ట్ హాఫ్ మొత్తానికి ఆడియెన్స్‌ను నవ్వించడంలో సఫలం అయినట్టుగా చెప్పకోవచ్చు.ఇక సెకండాఫ్‌ను ఎలా హ్యాండిల్ చేస్తాడో అని అందరికీ అనుమానం రావొచ్చు. కానీ ఫస్ట్ హాఫ్ కంటే సెకండాఫ్ మరింత హిలేరియస్‌గా ప్లాన్ చేసుకున్నారు. సెకండాఫ్ మొత్తం ఒకే చోట జరుగుతుంది. అయినా ఎక్కడా బోర్ కొట్టించలేదు. వైవా హర్ష, వెన్నెల కిషోర్, ప్రియదర్శి త్రయం నవ్విస్తూనే ఉంటారు. వైవా హర్ష అయితే తన ఎక్స్‌ప్రెషన్స్‌తోనే కడుపుబ్బా నవ్వించేస్తాడు. అలా ప్రీ క్లైమాక్స్ వరకు హర్ష నవ్విస్తూనే ఉంటాడు. ద్వితీయార్థం మొత్తం ఒకే హోటల్, ఒకే చోట జరిగినా కూడా పలు ట్రాకులు పెట్టడంతో ఎక్కడా బోరింగ్ అనిపించదు. సెకండాఫ్‌లో కొన్ని సీక్వెన్సులకు పొట్టచెక్కలయ్యేలా నవ్వాల్సిందే అన్నట్టుగా ఉంటుంది.

సారంగపాణి జాతకం రైటింగ్‌తోనే పాస్ అయినట్టుగా కనిపిస్తుంది. ఇంద్రగంటి మ్యాజిక్ ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరానికి తగ్గట్టుగా ట్రెండీ డైలాగ్స్ రాశాడు. పంచ్‌లు మాత్రం వర్షం కురిసినట్టుగా అలా కురుస్తూనే ఉంటాయి. డైలాగ్స్ ఈ చిత్రానికి ప్రధాన బలం అని చెప్పకోవచ్చు. సంగీతం అంత గొప్పగా ఏమీ అనిపించదు. పాటలు ఎక్కువగా గుర్తుండకపోవచ్చు. కెమెరా వర్క్ బాగుంటుంది. ఎడిటింగ్ టీం పనితీరు కూడా బాగుంటుంది. ముఖ్యంగా శ్రీదేవీ మూవీస్ బ్యానర్ బ్రాండ్ వ్యాల్యూ కనిపిస్తుంది. నిర్మాత శివలెంక మరోసారి తన అభిరుచిని చాటుకున్నట్టుగా అనిపిస్తుంది.నటీనటుల విషయానికి వస్తే.. ప్రియదర్శి తన కామెడీతో మెప్పిస్తాడు. ఎమోషనల్ సీన్స్‌లోనూ ఆకట్టుకుంటాడు. తన రేంజ్‌లో చిన్నపాటి యాక్షన్స్ కూడా చేశాడు. ఇక వెన్నెల కిషోర్, వైవా హర్ష ద్వయం చేసిన కామెడీకి పొట్ట చెక్కలవ్వాల్సిందే. ఈ ఇద్దరూ తమ తమ పాత్రల్లో నవ్వించేశారు. రూపా కొడవయూర్ తెరపై అందంగా కనిపిస్తుంది. ఇక నరేష్, వడ్లమాని శ్రీనివాస్, తణికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల ఇలా అందరూ కూడా తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా.. ఎక్కడా వల్గారిటీకి తావు లేకుండా.. అసభ్యకర సీన్లను ఇరికించకుండా.. తీసిన క్లీన్ చిత్రమే సారంగపాణి జాతకం.

## ఇస్రో మాజీ ఛైర్మెన్ డాక్టర్ కే కస్తూరిరంగన్ కన్నుమూత



ఇస్రో మాజీ ఛైర్మెన్ డాక్టర్ కే కస్తూరిరంగన్ కన్నుమూశారు. ఆయన వయసు 88 ఏళ్లు. బెంగుళూరులోని తన నివాసంలో ఇవాళ ఉదయం 10.43 నిమిషాలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఇస్రో ఛైర్మెన్‌గా ఆయన తొమ్మిదేళ్లు పనిచేశారు. అంతరిక్ష రంగంలో భారత్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారు. ఆగస్టు 27, 2003లో ఆయన ఇస్రో ఛైర్మన్ పదవీ నుంచి రిటైర్ అయ్యారు. ఇస్రో ప్రయోగించిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్స్ భాస్కరా-1, 2, కు ప్రాజెక్టు డైరెక్టర్‌గా చేశారాయన. ఇండియన్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఐఆర్ఎస్-1ఏ ప్రయోగించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కేరళలోని ఎర్నాకుళంలో కస్తూరిరంగన్ జన్మించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులను ఆయన అందుకున్నారు.

## 'కలియుగమ్-2064' ట్రైలర్ రిలీజ్




శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధానపాత్రల్లో నటించిని తాజా చిత్రం 'కలియుగమ్-2064'. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించగా.. ఆర్.కె. ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కె.ఎస్. రామకృష్ణ నిర్మించారు. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. 2064లో ఈ సినిమా కథ జరగబోతున్నట్లు తెలుస్తుంది. భవిష్యత్తులో మానవులు ఎలా జీవిస్తారు, ఎలా బతుకుతారు, ఎలా మరణిస్తారు అనే అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ప్రస్తుతం ఆకట్టుకుంటున్న ఈ సినిమా ట్రైలర్ మీరు కూడా చూసేయండి.




## రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు సీరియస్

రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. వినాయక్ దామోదర్ సావార్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలను కోర్టు తప్పుపట్టింది. బ్రిటీషర్ల పెన్షన్ తీసుకున్నట్లు సావార్కర్‌పై రాహుల్ ఆరోపించారు. ఈ కేసులో జస్టిస్ దీపాంకర్ దత్తా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు సావార్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. ఒకవేళ రాహుల్ మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అప్పుడు ఆయనపై సుమోటో కేసును నమోద చేసి చర్యలు తీసుకోనున్నట్లు కోర్టు చెప్పింది. అయితే గతంలో మెజిస్ట్రేట్ కోర్టు ఈ కేసులో సమన్లు జారీ చేసింది. ఆ సమన్లపై సుప్రీం స్టే ఇచ్చింది. సమన్లపై స్టే ఇస్తూ కోర్టు కొన్ని కీలక అభిప్రాయాలు వ్యక్తం చేసింది. రాహుల్ గాంధీ నానమ్మ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ.. సావార్కర్‌ను పొగుడుతూ లేఖ రాసినట్లు కోర్టు గుర్తు చేసింది.

## మేధా పాట్కర్ అరెస్ట్



ప్రముఖ సామాజిక కార్యకర్త, 'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమ నాయకురాలు మేధా పాట్కర్‌ను ఢిల్లీ పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు. దాదాపు 24 ఏళ్ల క్రితం, 2000 సంవత్సరంలో నమోదైన పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ అరెస్టు జరిగింది. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దాఖలు చేసిన ఈ కేసులో న్యాయస్థానం ఇటీవల మేధా పాట్కర్‌పై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ వారెంట్ నేపథ్యంలోనే ఢిల్లీ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మేధా పాట్కర్, వీకే సక్సేనాల మధ్య రెండు దశాబ్దాలకు పైగా న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, 2000 సంవత్సరంలో సక్సేనా అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే స్వచ్ఛంద సంస్థకు అధిపతిగా వ్యవహరించేవారు. ఆ సమయంలో నర్మదా బచావో ఆందోళన్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారని ఆరోపిస్తూ సక్సేనాపై మేధా పాట్కర్ తొలుత ఓ కేసు దాఖలు చేశారు.



## బీచ్‌లో నికితా శర్మ బోల్డ్ పోజు

ఇటీవల, నటి ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని బోల్డ్ చిత్రాలను షేర్ చేసింది, ఇది సోషల్ మీడియాలో ఉష్ణోగ్రతను పెంచింది.నికితా శర్మ బీచ్‌లో బోల్డ్ పోజు ఇచ్చింది. ఈ చిత్రాలు దావానలంలా వైరల్ అవుతున్నాయి.నటి యొక్క ఈ కిల్లర్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.అలాగే, ఆమె అభిమానులు ఆమె హాట్‌నెస్‌ను ప్రశంసించడంలో ఎప్పుడూ అలసిపోరు. వారు ఈ చిత్రాలపై హృదయపూర్వక శీర్షికలను పోస్ట్ చేస్తున్నారు.అయితే, నికితా ఇలాంటి బోల్డ్ చిత్రాలను అభిమానులతో పంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. దీనికి ముందే, నటి తన బోల్డ్ చిత్రాలను చాలాసార్లు పంచుకుంది.నికితా శర్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.



## వర్ష బీభత్సంతో విరిగిపడ్డ కొండచరియలు.. చిక్కుకుపోయిన 1,000 మంది పర్యాటకులు

ఈశాన్య రాష్ట్రం సిక్కింలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఉత్తర సిక్కింలో నిరంతరం వర్షం పడుతోంది. దీంతో వరదలు సంభవించాయి. భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు కీలక రహదారులను మూసివేశారు. ఈ కారణంగా వెయ్యి మందికిపైగా పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయారు. మున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్-చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చాలా ప్రాంతాల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతించడం లేదు. ఈ పరిస్థితి కారణంగా వెయ్యి మంది పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. రంగంలోకి దిగిన అధికారులు వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సూర్య
www.suryaa.com
EVENING 4PM EDITION



## మత్స్యకారుల అకౌంట్లలోకి రేపే రూ.20 వేలు

ఏపీలోని కూటమి ప్రభుత్వం శనివారం నుంచి 'మత్స్యకార భరోసా' నిధులను అకౌంట్లలో జమ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతి కింద అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలు అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఈ పథకం కింద 1,22,968 మంది జాలర్లకు లబ్ధి చేకూరనుంది.

## తగ్గిన మిర్చి ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి, పత్తి ధరలు ఈ విధంగా ఉన్నాయి. క్వింటా మిర్చి ధర రూ. 13, 500 జెండా పాట పలుకగా, క్వింటాల్ పత్తి ధర రూ. 7, 650 జెండా పాట పలికినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు. నిన్నటితో పోల్చితే పత్తి ధర మాత్రం రూ. 350 పెరగగా, మిర్చి ధర రూ. 175 తగ్గినట్లు వ్యాపారులు చెప్పారు. మార్కెట్లో ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

## పాకిస్తాన్ కుట్రలో భాగమే ఉగ్రదాడి

జమ్మూకాశ్మీర్లో జరిగిన దాడితో పాకిస్తాన్ కు సంబంధం ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. గురువారం సత్తుపల్లిలోని నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు నంబూరి రామలింగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పర్యాటకులు జమ్మూకాశ్మీర్ కు వస్తే కేవలం హిందువులను మాత్రమే గుర్తించి చంపేశారని ఆందోళన వ్యక్తం చేశారు.





## నేడు అమిత్‌షా నివాసంలో సింధు జలాలపై కీలక సమావేశం

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందం రద్దు చేసి, వాఘా-అట్టారీ సరిహద్దును మూసివేసింది. ఈ మేరకు సింధు జలాల వివాదాస్పద అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాసంలో నేడు కీలక సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కేంద్ర జలశక్తి మంత్రి సహా పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. జలవనరుల పంపిణీ, దేశాల మధ్య ఒప్పందాల అమలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది.

## రానున్న 5 రోజులు జాగ్రత్త

ఏపీలో ఎండలు మండిపోతున్నాయి. రాబోయే ఐదు రోజుల్లో రాయలసీమలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల మధ్యలో నమోదవుతాయని APSDM తెలిపింది. శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని ప్రకటించింది. ఇక శుక్రవారం పార్వతీపురం మన్యంలో 8 మండలాలు, విజయనగరంలో 5, శ్రీకాకుళంలో 4 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 21 మండలాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది.

## గెస్ట్ లెక్చరర్ల సర్వీసు పొడిగింపు

ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్టు లెక్చరర్ల సర్వీసును మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు 2025 - 2026 విద్యా సంవత్సరానికి సర్వీసును. పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో 957 మందికి లబ్ధి చేకూరనుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు వీరి సేవలను నిలిపివేశారు. వేసవి సెలవుల అనంతరం వీరు క్లాసులు తీసుకోనున్నారు.





## టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్న ధనశ్రీ

భారత్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ మాజీ భార్య ధనశ్రీ టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనుంది. 'ఆకాశం దాటి వస్తావా' అనే సినిమాలో ధనశ్రీ ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ మూవీకి శశికుమార్ డైరెక్షన్ వహిస్తున్నారు. కాగా తెలుగు ప్రముఖ కొరియోగ్రాఫర్ యష్ హీరోగా నటిస్తున్నాడు. ఇక ఈ మూవీ షూటింగ్ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇందులో ధనశ్రీ డ్యాన్సర్‌గా కనిపించనుందట. చాహల్‌తో విడాకుల తర్వాత ధనశ్రీ నటిస్తోన్న మొదటి సినిమా ఇదే.

## అమాయకులను చంపడం దుర్మార్గం: నాదెండ్ల

ఉగ్రదాడిలో అమాయకులైన 26 మంది పర్యాటకులను చంపడం దుర్మార్గమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఉగ్ర దాడులను నిరసిస్తూ శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో విజయవాడలోని పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.



## మరోసారి ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య గొడవ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ మధ్య మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. రష్యా- ఉక్రెయిన్ మధ్య మూడేళ్లకుపైగా సాగుతోన్న యుద్ధం ముగింపునకు చర్చలు జరుగుతోన్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. మార్చిలో కూడా అమెరికా పర్యటనకు వచ్చిన జెలెన్‌స్కీ.. ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో భేటీ సమయంలో గొడవపడి అర్థాంతరంగా చర్చల నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ సారి ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య క్రిమియా అంశంపై వివాదం తలెత్తింది. క్రిమియాను రష్యా భూభాగంగా ట్రంప్ పరిగణిస్తుంటే.. జెలెన్‌స్కీ దీనికి అంగీకరించలేదు. ఉక్రెయిన్ తన ప్రాథమిక సూత్రాలపై నిలబడుతుందని ఆయన మరోసారి స్పష్టం చేశారు. లండన్ వేదిక రష్యా-ఉక్రెయిన్‌పై జరుగుతోన్న చర్చల్లో అమెరికా ప్రతిపాదించిన రెండు కీలక అంశాలు మాస్కోకు అనుకూలంగా ఉన్నాయని సమాచారం. అందులో ఒకటి క్రిమియాను అధికారికంగా రష్యా ప్రాంతంగా గుర్తించడం, రెండోది ఉక్రెయిన్ ఎప్పటికీ నాటో సభ్యత్వం పొందకూడదు. అయితే, ఈ రెండు ప్రతిపాదనలను ఉక్రెయిన్ తిరస్కరించడంతో ట్రంప్ అసహనంతో స్పందించారు. కీవ్ తలవంచకుంటే చర్చల నుంచి అమెరికా వైదొలగుతుందని ట్రంప్ హెచ్చరించారు. ఈ క్రమంలో జెలెన్‌స్కీపై విమర్శలు గుప్పించారు. 'క్రిమియాను కీవ్ చాలా సంవత్సరాల క్రితమే కోల్పోయింది, ఇది చర్చకు కూడా లొంగదు' అని ట్రంప్ అన్నారు. ఈ ప్రతిపాదనను జెలెన్‌స్కీ ఖరాఖండిగా తిరస్కరిస్తూ.. 'రష్యా ఆక్రమణను ఉక్రెయిన్ ఎప్పటికీ గుర్తించదు. ఇక్కడ చర్చించేదేమీ లేదు. ఇది మా రాజ్యాంగానికి వ్యతిరేకం' అని చెప్పారు. కీవ్ అధినేత వ్యాఖ్యలపై ట్రంప్ స్పందిస్తూ.. 'మీ దేశంలో హత్యలు ఆపడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. మేము ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం.. కానీ జెలెన్‌స్కీ దృఢత్వం చర్చలను స్థిరదశలోకి నడిపించేస్తోంది' అని ఆరోపించారు.

సోషల్ మీడియాలో ట్రంప్ విమర్శలు

ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేస్తూ.. ''ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ 'క్రిమియా ఆక్రమణను ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టబద్ధంగా గుర్తించమని వాల్ స్ట్రీట్ జర్నల్‌కి చెప్పారు. ఇది శాంతిచర్చలకి చాలా హానికరం. క్రిమియాను చాలా ఏళ్ల క్రితమే కోల్పోయారు. ఇది చర్చలకు తగదు.. జెలెన్‌స్కీ క్రిమియాను నిజంగా కోరుకుంటే, పదకొండేళ్ల కిందట రష్యా ఆక్రమించినప్పుడు ఎందుకు పోరాడలేదు?' అని ప్రశ్నించారు. 2014లో ఉక్రెయిన్ నుంచి పెద్ద ప్రతిఘటన లేకుండానే క్రిమియాను రష్యా ఆక్రమించింది. అప్పట్లో మాస్కో తీరును అంతర్జాతీయ సమాజం ఖండించింది. కొద్ది దేశాలే రష్యా హక్కును గుర్తించాయి.

ట్రంప్-జెలెన్‌స్కీ భేటీలో గొడవ.. వెళ్లిపోయిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిక

అటు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ట్రంప్‌ను సమర్థిస్తూ.. 'రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతిచర్చలు జరగపోతే, అమెరికా పూర్తిగా వైదొలగాల్సిన సమయం వచ్చింది' వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న భూభాగ హద్దుల్లోనే యథాతథ స్థితిని కొనసాగించాలి. దీర్ఘకాలిక రాజనీతిక పరిష్కారం ద్వారా శాంతి సాధించాలి. సైనికులు రెండు వైపులా ఆయుధాలు వదిలి.. యుద్ధం నిలిపివేయడమే అసలైన పరిష్కారం' అని JD వాన్స్ వ్యాఖ్యానించారు. వాన్స్ వ్యాఖ్యలకు జెలెన్‌స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అండ్రీ యెర్మాక్ తీవ్రంగా స్పందించారు. 'ఉక్రెయిన్ రాజ్యాధికారం, భూభాగ సమగ్రతపై స్థిరంగా నిలుస్తుంది' అని లండన్‌లో అమెరికా ప్రతినిధికి తేల్చిచెప్పారు.

మాస్కోకు అనుకూలంగా అమెరికా?

జనవరిలో అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉక్రెయిన్- రష్యా యుద్ధంలో అమెరికా వైఖరి పూర్తిగా మారిపోయింది. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విధానానికి భిన్నంగా.. కీవ్‌కు ఆమోదయోగ్యం లేని ప్రతిపాదనలో శాంతి ఒప్పందం కోసం ఉక్రెయిన్‌పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కొన్ని రోజుల్లోనే ముగిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. ఇప్పుడాయన ప్రపంచానికి శాంతి దూతగా కనిపించాలని తాపత్రయపడుతున్నారు. అదే సమయంలో ట్రంప్-పుతిన్ ఫోన్ కాల్ తర్వాత అమెరికా విధానం మాస్కోకు అనుకూలంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు సాయపడేందుకు కొత్త మార్గాలు వెతుకుతున్నాయి. ఉక్రెయిన్ మాత్రం భవిష్యత్ పట్ల గందరగోళంగా ఉంది.

## భారత్ చావు దెబ్బ వేళ మిసైల్ టెస్ట్‌కు సిద్ధమైన పాకిస్తాన్

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దౌత్యపరంగా భారత్ ఇచ్చిన షాక్ నుంచి తేరుకోకముందే పాకిస్తాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. కరాచీ తీరంలో మిసైల్ టెస్ట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. భూతలం నుంచి భూతలానికి ప్రయోగించే క్షిపణిని ప్రయోగించేందుకు పాక్ సిద్ధమైంది. ఇక ఇలాంటి చర్యలను భారత్ పరిశీలిస్తోంది. మరోవైపు.. రెండు దేశాల మధ్య తాజా ఉద్రిక్తతల నేపథ్యంలోనే ముంబైలో హై అలర్ట్ విధించారు. ఇప్పటికే భారత్ పాక్ మధ్య సంబంధాలు క్షీణించగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత అవి మరింత దారుణంగా తయారయ్యాయి. ఈ క్రమంలోనే బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ.. 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇప్పుడు ఏ క్షణం ఏం జరుగుతుందో అనే ఉద్రిక్తత రెండు దేశాల మధ్య నెలకొంది. ఇప్పటికే పాక్‌పై విధించిన ఆంక్షలకు తోడు మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్న భారత్.. ఇక నుంచి దాయాది దేశంపై కనికరం లేకుండా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు పాకిస్తాన్ మరో చర్యకు సిద్ధం అయింది. తాజాగా క్షిపణి పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. రెండు దేశాల మధ్య ఉద్రికత్తలు తారస్థాయికి చేరిన వేళ పాకిస్తాన్ కూడా తాజాగా సంచలన నిర్ణయానికి తెరలేపింది. ఇందులో భాగంగానే క్షిపణి పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైంది. గురు, శుక్రవారాల్లో కరాచీ తీరం వెంట ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో భూతలం నుంచి భూతలం పైకి ప్రయోగించే క్షిపణిని టెస్ట్ చేసేందుకు ఇప్పటికే పాక్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇక తాజా పరిణామాలను భారత రక్షణ రంగ వర్గాలు నిశితంగా




పరిశీలిస్తున్నాయి. మురోవైపు.. కాశ్మీర్‌లో లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ చేసిన దాడితో దేశవ్యాప్తంగా నిఘా వర్గాలు అప్రమత్తం అయ్యాయి. ఇక దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబైలో హై అలర్ట్ విధించారు. దీంతో ముంబై నగరం మొత్తం భద్రతను కట్టుదిట్టం చేశారు. నగరవ్యాప్తంగా ముంబై పోలీసులు క్రమం తప్పకుండా రాత్రిపూట గస్తీ నిర్వహించాలని.. పోలీస్ ఉన్నతాధికారులు కూడా అనుక్షణం అలర్ట్‌గా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. నగరంలోని రద్దీ ప్రదేశాలైన బీచ్, ఫైవ్ స్టార్ హోటల్స్, రైల్వే స్టేషన్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు వంటి ప్రాంతాల్లో గస్తీని మరింత ముమ్మరం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ఐదుగురు ముష్కరులు పాల్గొన్నారని.. వారు అటవీ ప్రాంతంలో నుంచి వచ్చి.. 10 నిమిషాల పాటు భీకర కాల్పులకు తెగబడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. చాలా మంది ప్రయాణికులను అతి దగ్గరి నుంచి కాల్చడంతో వారు అక్కడే ప్రాణాలు విడిచినట్లు తెలుస్తోంది.

## ఓటీటీలోకి మ్యాడ్ స్క్వేర్

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ స్క్వేర. మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాగా.. మొదటి పార్ట్‌లో నటించిన జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, సంతోష్ శోభన్ సోదరుడు సంగీత్ శోభన్‌తో పాటు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించగా.. నాగవంశీ నిర్మించాడు. ఏప్రిల్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది.

